దర్జాగా అమ్ముకుంటున్నారు..!

- మల్కాపురం మార్కెట్ స్థలం తమకే సొంతమన్నట్లు వ్యవహరిస్తున్న ఓ వర్గం
- దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్న వైనం
- పట్టించుకోని గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: బతుకుదెరువు కోసం గ్రామ కంఠం స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న కొందరు.. ఆ భూమి తమ సొంతమన్నట్లు భావిస్తున్నారు. బడ్డీలతో వారి అవసరం తీరాక దర్జాగా వాటిని అమ్మేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విక్రయాల వెనుక గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు ఉన్నాడనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. ఈ వ్యవహారంపై మల్కాపురం గ్రామాభివృద్ధి సంఘం పాలకవర్గ ప్రతినిధులు స్పందించకపోవడం విశేషం.

గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహించే స్థలం

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో గ్రామదేవతలను నెలకొల్పే స్థలానికి ఎదురుగా సదరం పట్టుకు సుమారు 15 సెంట్ల భూమి ఉంది. ఇక్కడ మూడేళ్లకు ఒకసారి గ్రామదేవతల ఉత్సవాలు జరుగుతాయి. ఈ స్థలంలోనే ప్రస్తుతం మార్కెట్ నిర్వహిస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న కొంత మంది తమ జీవనోపాధి నిమిత్తం గ్రామాభివృద్ధి కమిటీ అనుమతులు లేకుండా కొన్నేళ్ల కిందట ఈ స్థలంలో బడ్డీలు ఏర్పాటు చేసుకున్నారు. అమ్మవార్ల ఉత్సవాలు నిర్వహించే సమయంలో ఈ దుకాణాలను తాత్కాలికంగా తొలగించి తొమ్మిది రోజుల అనంతరం యథాస్థానంలో పెట్టుకుంటారు. గ్రామ పెద్దలకు విషయం తెలిసినా బడ్డీలపై ఆధారపడి జీవిస్తున్నారని భావించి వదిలేసేవారు.


మల్కాపురం మార్కెట్ స్థలంలో కమిటీ అనుమతి లేకుండా వెలసిన షాపులు

అమ్మకానికి.. అద్దెకు బడ్డీలు

పెద్దలు పట్టించుకోవడం లేదని గ్రహించిన స్థానికంగా ఓ సామాజిక వర్గానికి చెందిన వారు అధిక మొత్తంలో ఉత్సవాలు నిర్వహించే స్థలంలో రకరకాల వ్యాపారాల నిమిత్తం షెడ్లు, బడ్డీలు వేసుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. బడ్డీలు నిర్వహిస్తున్న వ్యాపారులు వారికి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా లేదా అధిక మొత్తంలో డబ్బులు వస్తాయని తెలిసినా ఆ బడ్డీలను ఇతరులకు అమ్ముకుంటున్నారు. ఇటీవల ఓ వ్యక్తి తన బడ్డీని రూ.70 వేలకు అమ్ముకోవడం, దీని వెనుక ప్రస్తుత గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుడు ఉన్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ చికెన్ షాపు పెట్టుకున్న ఒకరి వద్ద నుంచి ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రతి నెలా అక్రమంగా అద్దె వసూలు చేస్తున్నాడు. నిజానికి అద్దె గ్రామాభివృద్ధి కమిటీకి చెల్లించాల్సి ఉంది. దీనిపై కమిటీ ప్రతినిధులు మౌనంగా ఉండటంతో ఇదే తరహాలో మరికొందరు బడ్డీలు ఏర్పాటు చేసుకుని, ప్రతి నెలా వారు అద్దెలు తీసుకుంటున్నట్లు ఆరోపణ ఉంది. గ్రామాభివృద్ధి సంఘం ప్రతినిధులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని, గ్రామదేవతల ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మల్కాపురంలోని పలు కులాల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.


మార్కెట్‌లో అమ్ముకుంటున్న దుకాణాలు ఇవే

చర్యలు తీసుకుంటాం



మా గ్రామానికి చెందిన స్థలంలో కొంత మందికి బతుకుదెరువు నిమిత్తం బడ్డీలు వేసుకుంటామంటే అనుమతులిచ్చాం. వాటిని వారు అక్రమంగా అమ్ముకుని వ్యాపారం చేసుకుంటామంటే ఊరుకోం. దీనిపై గ్రామం కంఠం పెద్దలంతా సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ఉరుకూటి బాబూరావు యాదవ్, ప్రధాన కార్యదర్శి, మల్కాపురం గ్రామాభివృద్ధి సంఘం

గ్రామ కంఠం స్థలాన్ని కాపాడుకోవాలి



మా గ్రామ కంఠం స్థలం కళ్ల ముందు మాయమవుతుంటే బాధగా ఉంది. గతంలో ప్రకాష్‌నగర్ వద్ద గల గ్రామ కంఠం స్థలాన్ని కొంత మంది నాయకుల సాయంతో మరికొందరు ఆక్రమించి, వాటిలో నిర్మాణాలు చేపట్టారు. ఇప్పుడు గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహించే ఈ స్థలం పరిస్థితి అలాగే ఉంది. పాలకవర్గం వారు దీనిపై దృష్టి పెట్టాలి.

– నూకరాజు, మల్కాపురం

క్లుప్తంగా

సబ్సిడీ టమాటా కౌంటర్ ప్రారంభం


సబ్సిడీ టమాటా విక్రయాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజారులో బుధవారం సబ్సిడీ టమాటా కౌంటర్‌ను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టమాటా ధర భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలపై భారం పడకుండా కిలో టమాటా రూ.50కు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో అన్నదానం


అన్నప్రసాదం వడ్డిస్తున్న వానపల్లి శ్రీనివాసరావు, భవానీ మాలధారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దుర్గానగర్‌లో వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. వానపల్లి కనకమహాలక్ష్మి నేతృత్వంలో భవానీ మాలధారులు, మహిళలు కుంకుమ పూజలు చేశారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేశారు. ఈ నెల 13న అమ్మవారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు జరుగుతాయని ఉత్సవ నిర్వాహకుడు వానపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వి.హేమంత్‌సాయి, నమ్మి మాన్విత, జశ్వంత్, మణివర్ధన్, మనోజ్‌కుమార్, వి.సుప్రజ, రమ్యశ్రీ, గిరిష్ తదితరులు పాల్గొన్నారు.

63వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

సింథియా: జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో బుధవారం స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ గల్లా చిన్నా విస్తృతంగా పర్యటించారు. స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు వార్డులో మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. వార్డు ప్రజలు నేరుగా కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలియజేయాలని కోరారు. జై ఆంధ్రా కాలనీలో ఆటో యూనియన్ నెలకొల్పిన దుర్గాదేవి మండపంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను కార్పొరేటర్ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గూడెల కృష్ణ, జెర్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ, బాబూరావు, కనక, ఆలయ కమిటీ సభ్యులు సన్యాసిరావు, నారాయణరావు, మాకరమ్మ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆత్మజ్ఞానం


తటవర్తి రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న సభ్యులు

పెదగంట్యాడ: ధ్యానం ద్వారానే ఆత్మజ్ఞానం సిద్ధిస్తుందని ఆధ్యాత్మికవేత్త తటవర్తి రాజ్యలక్ష్మి అన్నారు. బ్రహ్మర్షి భగవాన్ పితామహ పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ప్రతినిధి మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో బుధవారం నిర్వహించిన ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని, సంపూర్ణ శాకాహారులుగా మారాలని కోరారు. దేవీ నవరాత్రుల్లో అమ్మవారి అవతారాల విశిష్టతను వివరించారు. ఆమెను ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

రహదారి అభివృద్ధికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులో గోపాలపట్నం పోలీస్ స్టేషన్ ఎదురుగా ధరణి కోస్టల్ అపార్ట్‌మెంట్ నుంచి లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ వరకు చేపట్టే రహదారి ఆధునికీకరణ పనులకు బుధవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నిర్మాణం కోసం రూ.19.71 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఈఈ రత్నాకర్‌రెడ్డి, ఏఈ వెంకటలక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, టీడీపీ వార్డు అధ్యక్షుడు ప్రసాద్, నరవ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

3.2 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివనారాయణ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మధురై జిల్లాకు చెందిన పుకా జహేంతి కాలిముత్తు విశాఖ మీదుగా చెన్నైకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని నుంచి 3.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, గవర్నమెంట్ రైల్వే పోలీస్‌లకు అప్పగించారు. జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్‌మారూఫ్ కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

సెయిల్‌లో విలీనం చేయాల్సిందే..


మాట్లాడుతున్న ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1336వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించి సొంత గనులు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో సెయిల్‌లో విలీనం చేయాల్సిందేనన్నారు. సుమారు మూడున్నర సంవత్సరాల నుంచి ఉక్కు పరిరక్షణ కోసం వివిధ రకాల పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఆలోచించకుండా ముందుకెళ్తుండడం ఆంధ్రులను రెచ్చగొట్టడమే అవుతుందన్నారు. పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పెద్దన్న పాత్ర పోషించి విశాఖ ఉక్కును కాపాడాలన్నారు. ఈ విషయంలో ద్వంద్వ వైఖరి అనుసరిస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన వారుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, సుబ్బయ్య పాల్గొన్నారు.

సరికొత్తగా పార్కులు


ఎన్ఏడీ పార్కులో ఊయల ఊగుతున్న, ఆటలాడుతున్న చిన్నారులు

- దెబ్బలు తగలకుండా రబ్బర్ మ్యాట్‌ల ఏర్పాటు
- ఆడుతూ కింద పడినా నో ప్రాబ్లం
- క్యూ కడుతున్న చిన్నారులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులో ఎన్ఏడీ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేలా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. వార్డులోని అంబేడ్కర్ నగర వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా పార్కును అభివృద్ధి చేశారు. దీనిలో పిల్లల కోసమని ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. జారుడు బల్ల, ఊయల, ఇతర ఆటలు ఆడే సమయంలో పిల్లలు కింద పడినా దెబ్బలు తగలకుండా ఒక రకమైన సింథటిక్ రబ్బర్ మ్యాట్(ఈపీడీఎం)ను అమర్చారు. ఇది మెత్తగా ఉండటంతో పిల్లలు ఇక్కడ ఆడుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.

ముంబై నుంచి రబ్బర్ మ్యాట్

జీవీఎంసీ జోన్–5 పరిధిలో ఎన్ఏడీ వద్ద, మల్కాపురంలోని పార్కులో ఈ విధంగా ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 52వ వార్డులోని కరాస పార్కులో కూడా ఇదే రీతిన సిద్ధం చేస్తున్నారు. రబ్బర్ మ్యాట్‌ను ముంబై నుంచి తెప్పిస్తున్నారు. దీన్ని అక్కడి నుంచి వచ్చే నిపుణులే అమర్చుతున్నారు. ఎండైనా, వానైనా ఇక్కడి పార్కులో పిల్లలు ఆడుకోవచ్చని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం దసరా సెలవులు కావడంతో ఎన్ఏడీ పార్కుకు పిల్లలు క్యూ కడుతున్నారు. వారి కోసమని ప్రత్యేకంగా పార్కును అభివృద్ధి చేసి, ఇలాంటి సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేసేలా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంపై కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పార్కులో ఆట పరికరాల వద్ద ఆడుకుంటున్న పిల్లలు

చురుగ్గా సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేయిస్తున్న మాధవ్

మల్కాపురం: శ్రీహరిపురంలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సెల్‌ఫోన్‌లో పార్టీ యాప్ ద్వారా పలువురికి సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ తిరుగులేని శక్తిగా మారిందన్నారు. దీనికి కారణం పీఎం నరేంద్రమోదీ పాలనపై ప్రజలకు కలుగుతున్న నమ్మకమేనని పేర్కొన్నారు. సుమారు వంద మంది వరకు సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. ములగాడ మండల అధ్యక్షుడు కొలూరు గురుమూర్తి, బీజేపీ 58వ వార్డు అధ్యక్షుడు తెప్పల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిమేర శ్రీనివాసరావు, లక్కరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి ప్రణమిల్లి

- సరస్వతీదేవిగా దుర్గమ్మ దర్శనం
- భక్తిశ్రద్ధలతో పూజించిన చిన్నారులు


92వ వార్డులో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోపాలపట్నంలోని పలు దేవాలయాలు, మండపాల్లో చదువుల తల్లికి చిన్నారులు మంచి చదువులివ్వమ్మ అంటూ పూజలు చేశారు. గవర వీధిలో యంగ్ ఫ్రండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో చిన్నారులు కుంకుమ పూజలు చేశారు.

- కొత్తపాలెం విజయదుర్గాదేవి ఆలయంలో భక్తులు సామూహిక పూజలు, అర్చనలు చేశారు.
- 92వ వార్డు నందమూరినగర్ ఉమా రామలింగేశ్వరాలయంలో విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు వైఎస్సార్‌సీపీ నేత బెహరా భాస్కరరావు నోటు పుస్తకాలు పెన్నులు, పెన్సిళ్లు అందించారు.
- 89వ వార్డులోని పలు మండపాల వద్ద అన్నసమారాధనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.
- గోపాలపట్నం ప్రధాన రహదారిలోని శంకరా సినిమా హాల్ వద్ద మండప ఆవరణలో దీపారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దీపాలు వెలిగించారు.
- 89వ వార్డు ఖర్వేల్‌నగర్‌లోని దుర్గాదేవి మండపం వద్ద దీపారాధన చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.


90వ వార్డు సాయి మందిరంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


గవర వీధి మండపంలో సరస్వతీదేవిని పూజిస్తున్న చిన్నారులు


గాజువాకలో సరస్వతీ దేవిగా విజయదుర్గ


బుచ్చిరాజుపాలెంలో సరస్వతీదేవిగా..

సామూహిక అక్షరాభ్యాసం

మల్కాపురం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల విజయదుర్గా ఆలయంలో సుమారు 100 మంది విద్యార్థులచే సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 58వ వార్డు గుల్లలపాలెం రామ్‌నగర్‌లోని విజయదుర్గా ఆలయంలో ఎమ్మెల్యే పి.గణబాబు పూజలు చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీను, ఆలయ కమిటీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, పిల్లా సత్యనారాయణ, సుబ్బరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలో డేరింగ్ అండ్ డాషింగ్ యూత్ ఆధ్వర్యంలో దుర్గమ్మను సరస్వతీ దేవిగా అలంకరించి పూజలు జరిపారు. పలువురు చిన్నారులకు టీడీపీ నాయకుడు పాలిరెడ్డి దంపతులు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

జగన్మాతకు వైభవంగా పూజలు

విశాఖ విద్య: జీవీఎంసీ 52, 90 వార్డుల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కరాస, శాంతినగర్, బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ, కాకానినగర్, గవర వీధి తదితర ప్రాంతాల్లో కొలువైన జగన్మాతకు బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని దుర్గాలమ్మ–బంగారమ్మ వారు భక్తులకు సరస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఏపీఎస్ఈబీ కాలనీలోని షిర్డీసాయి మందిరంలో ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. సరస్వతీ పూజల్లో విద్యార్థులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు విళ్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


కొత్తపాలెం ఆలయంలో సరస్వతీదేవిగా దుర్గమ్మ



89వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న గోపాలకృష్ణ

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి


మాట్లాడుతున్న ఇస్కఫ్ కన్వీనర్ దేవరకొండ మార్కండేయులు

సీతంపేట : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నిర్వీర్యం చేసి ప్రైవేటుపరం చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని ఇస్కఫ్ కన్వీనర్ దేవరకొండ మార్కండేయులు ఆరోపించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఇస్కఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించి, సొంత గనులు, క్యాపిటల్ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు శ్యాంసుందర్, అప్పలరాజు, టి.ఎస్.సుకుమారన్, ఐమంది పైడిరాజు, సత్యనారాయణ, సూర్యకుమారి, మధుమతి, లక్ష్మీపతి, కృష్ణబాబు పాల్గొన్నారు.

'డైలాగ్ అండ్ డెమోక్రసీ' పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఈఏఎస్ శర్మ తదితరులు

సీతంపేట : సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ అధ్యక్షుడు ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ రచించిన డైలాగ్ అండ్ డెమోక్రసీ 5వ సంపుటి ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఫోరం ఫర్ బెటర్ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఇ.ఎ.ఎస్.శర్మ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెమోక్రసీ అనేది అమెరికన్ కానిస్టిట్యూషన్ నుంచి తీసుకున్నామని, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పలు దేశాల రాజ్యాంగాల నుంచి అనేక విషయాలు సంగ్రహించి ముసాయిదా తయారు చేశారన్నారు. యువతరం ప్రశ్నించే తత్వం అలవాటు చేసకోవాలన్నారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం సొసైటీ కార్యదర్శి డీఎస్.వర్మ, సాహితీవేత్తలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.